## కిక్ బాక్సింగ్‌లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులకు మెడల్స్, సర్టిఫికేట్స్‌ను అందజేసిన కలెక్టర్ సి.నారాయణరెడ్డి

వికారాబాద్/బొంరాస్‌పేట, జనవరి 22 : ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ జాతీయ స్థాయి పోటీల్లో బొంరాస్‌పేట కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి వారిని అభినందించారు. 8వ తరగతికి చెందిన ఏ వైష్ణవి గోల్డ్ మెడల్, పీ.నందిని సిల్వర్, ఎస్.నవిత సిల్వర్, 9వ తరగతికి చెందిన ఎన్.నందిని బ్రోన్జ్ మెడల్‌లను సాధించారు. ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను చూపారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి విద్యార్థినులకు మెడల్స్‌ను అందజేశారు. కేజీబీవీ ఎస్‌వో రాధిక, కోచ్ సాయిలు విజేతలను అభినందించారు.

## ప్రతిభ చూపిన సర్కారు బడి విద్యార్థి



విద్యాసాగర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న తెలంగాణ గణిత ఫోరం సభ్యులు

ఆదిబట్ల, జనవరి 22 ః ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగుళూరు మాడల్ పాఠశాల విద్యార్థి జిల్లాస్థాయి గణితం టాలెంట్ టెస్ట్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. పదో తరగతికి చెందిన విద్యాసాగర్ సోమవారం హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో 50 మార్కులకు గాను 48 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎన్నికయ్యాడు. ప్రిన్సిపాల్ లావణ్య, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

## నేడు జిల్లాలో హార్టికల్చర్ బృందం పర్యటన

వికారాబాద్, జనవరి 22 : శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్, బృందం నేడు జిల్లాలో పర్యటించనున్నది. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి కలెక్టరేట్‌లో మామిడి రైతులను సాగు విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి చక్రపాణి సోమవారం తెలిపారు. ఈనెల 24న ఈ బృందం పూడూరు గ్రామంలోని ఆర్చిడ్ పాలిహౌస్‌ను, మామిడి తోట, వికారాబాద్ హార్టికల్చర్ ఫామ్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు తెలిపారు.

# సమస్యలను పరిష్కరించండి

- ప్రజావాణికి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో దరఖాస్తుల వెల్లువ
- దరఖాస్తులను స్వీకరించిన వికారాబాద్ కలెక్టర్, రంగారెడ్డి అదనపు కలెక్టర్
- సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశం



వికారాబాద్ : ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 22 : ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పరిష్కరించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎన్నెపల్లి చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించాలని అధికారులకు తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ప్రతిజ్ఞ, సమావేశం ఉంటుందని, ఐదుగురు వృద్ధులు, ఐదుగురు కొత్తగా ఓటర్ ఐడీ పొందిన యువకులను సన్మానించాలన్నారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా ఆకర్షణీయమైన శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. అత్యుత్తమ సేవలందిస్తున్న ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : దరఖాస్తులను తీసుకుంటున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

**అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి..**

ఇబ్రహీంపట్నం, జనవరి 22 : ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన ఆర్జిలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి 40 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

## కొత్తపేటలో పంచాయతీ ప్రారంభోత్సవ లొల్లి




కొత్తపేట గ్రామ పంచాయతీ భవనం వద్ద పోలీసుల బందోబస్తు

షాద్‌నగర్, జనవరి 22: కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. భవన ప్రారంభానికి సోమవారం ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిలకు సమాచారం ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాన్ని అడ్డుకొని గందరగోళం సృష్టించారు. పోలీసులు బెదిరింపులకు దిగారని సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్ ఆరోపించారు. సర్పంచ్, ఎంపీటీసీని పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయాన్ని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ తెలుసుకుని కొందుర్గు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకుని కాంగ్రెస్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అక్రమ అరెస్టులను సహించం..**

అక్రమ అరెస్టులను సహించబోమని పీఏసీఎస్ కొత్తపేట వైస్ చైర్మన్ అంజిరెడ్డి, ఎంపీటీసీ దిద్దెల లక్ష్మమ్మలక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తపేట సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్‌లను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే కాంగ్రెస్ హయాంలో జూనియర్, డిగ్రీ కళాశాలల భవనాలను ఎందుకు నిర్మించలేకపోయారో చెప్పాలన్నారు. స్థానికంగా కేశంపేట పోలీస్‌స్టేషన్ అందుబాటులో ఉన్నప్పటికీ 40కిలో మీటర్లకు పైగా దూరం ఉన్న కొందుర్గు మండలానికి తరలించి రాక్షసానందాన్ని పొందారని విమర్శించారు.

## అగ్ని వీర్ వాయు ఎంపికకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 22 : ఎయిర్ ఫోర్స్‌లో అగ్ని వీర్ వాయుగా ఎంపిక కోసం యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ గుర్ ప్రీత్‌ఆత్వాల్, సికింద్రాబాద్ విభాగంతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్, దానికి తత్సమాన విద్యార్హత గల విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు ఉన్నవారు, తత్సమాన డిప్లమా కోర్సు పూర్తి చేసిన వారు ఇందుకు అర్హులు అన్నారు. 2 జనవరి 2004, 2 జూలై 2007 మధ్య జన్మించిన యువతీయువకులు అగ్ని వీర్ వాయు ఎంపిక కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ఫిబ్రవరి 6వ తేదీ వరకు http://agnipathvayu.cdac.in/ dwaraలో చేసుకోవచ్చన్నారు. ఆన్ లైన్ పరీక్ష మార్చి17న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అగ్ని వీర్ వాయు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకు ముందు ఎయిర్ ఫోర్స్ కమాండర్ గుర్ ప్రీత్ అత్వాల్ స్థానిక ఎస్‌ఏపీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించి విద్యార్థులకు అగ్ని వీర్ వాయుపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, జిల్లా యువజన, క్రీడల అధికారి హనుమంత్ రావు, ఎయిర్ ఫోర్స్ అధికారి కె.రాజేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం, జనవరి 22 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అన్నిశాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. గణతంత్ర వేడుకలు అట్టహాసంగా జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలన్నారు. కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా బందోబస్తును ఏర్పాటు చేయాలని, రాచకొండ పోలీసు అధికారికి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్‌రావుకు తెలిపారు. ఈనెల 24వ తేదీ సాయంత్రంలోపు వారి పేర్లను సిఫార్సు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏవో ప్రమీలరాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం వద్ద వేచి ఉన్న భక్తులు

ఉత్సవ విగ్రహాలు తీసుకొస్తున్న ఆలయ ప్రధానార్చకుడు, చైర్మన్, కమిటీ సభ్యులు

శంఖు ఊదుతున్న సాధువు

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో అగ్నిగుండం, పెద్దపట్నం తొక్కేందుకు వచ్చిన హైదరాబాద్ శివసత్తులు, జోగినిలు, భక్తులు



# భక్తజనం.. బండారి మయం

పసుపుమయంగా మల్లికార్జునుడి క్షేత్రం

పట్నం వారం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపువర్ణ శోభితమైంది. భక్తులు చల్లుకున్న పసుపుతో స్వామివారి సన్నిధి పసుపుమయమైంది. పంచవర్ణాల పెద్ద పట్నాన్ని దాటుకుంటూ అగ్నిగుండ ప్రవేశం చేస్తూ మేడలమ్మ, కేతమ్మ సమేత మల్లికార్జునుడిని దర్శించుకొని భక్తులు తన్మయత్వం పొందారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

- భక్తిశ్రద్ధలతో పెద్ద పట్నం
- ఉత్కంఠభరితంగా అగ్నిగుండాలు
- కోరమీసాల స్వామికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



కొమురవెల్లిలో పెద్దపట్నం, అగ్నిగుండం

చేర్యాల, జనవరి 22 : పట్నం వారం సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పసుపుమయంగా మారింది. హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయవర్గాల సహకారంతో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అగ్నిగుండాలను దాటే కార్యక్రమం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. పెద్దపట్నం చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు శనివారం ధూళి దర్శనం, ఆదివారం బోనాలు, పట్నాలు, సోమవారం పెద్ద పట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. మల్లన్న ఆలయ ఒగ్గు పూజారులు పట్నం వేసి కార్యక్రమాన్ని ప్రారంభించడంతో హైదరాబాద్ ఒగ్గు పూజారులు పంచవర్ణాలు (తెలుపు, పసుపు, నీలి, ఎరుపు, ఆకుపచ్చ) రంగుల పిండితో పెద్ద పట్నం వేశారు. పంచ పల్లవాలు (మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి) కట్టెలను వరుసగా పేర్చి అగ్నిగుండంగా తయారు చేశారు. అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పెద్దపట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దపట్నం, అగ్నిగుండాలను ఆలయ అర్చకులు దాటిన వెంటనే భక్తులు దాటారు. ఆలయంలో మల్లికార్జునస్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం మేరకు శివసత్తులు, ఘనాచార్యులకు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతోపాటు స్వామి వారి బండారిని పంపిణీ చేశారు. అంతకు ముందు భక్తులు పసుపును ఒల్లంతా పూసుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించడంతో పాల్గొనేందుకు భక్తులు గంటల పాటు వేచి ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆడబిడ్డలను గౌరవించండి

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్..




ఆడబిడ్డలపై వివక్ష వీడాలని ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం, జనవరి 22 : ఆడపిల్లలపై వివక్షను వీడాలంటే ముందుగా కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ఈనెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో జిల్లా సంక్షేమ అధికారి పద్మజారమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించడం, చదివించడం వల్ల సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. ఆడ, మగ తేడాలు పిలిచే పిలుపులో ఉండాలి తప్పా చూపించే ప్రేమలో ఉండకూడదన్నారు. అమ్మాయిలు ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థి, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన, ప్రతి అంశంపై చర్చించేలా శిక్షణ ఇవ్వాలని డీఈవోకు సూచించారు. సమాజంలో అమ్మాయిలు స్నేహితులకు గాని తమ తోటి వారు సమస్యల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ఎదుర్కొనేందుకు తోడ్పాటునందించాలన్నారు. తల్లిదండ్రులు, టీచర్లు, స్నేహాభావంతో ఉన్నప్పుడు సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారని తెలిపారు. అధికారులు, ఎన్జీవోలు గ్రౌండ్‌స్థాయిలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలన్నారు. 18 ఏండ్లు నిండిన తర్వాతే వివాహం చేయించాలని ప్రతిజ్ఞ చేయించారు. బేటీ బచావో.. బేటీ పడావో క్యాలెండర్, కెరీర్ గౌడెన్స్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఇజల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్‌రావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణ, సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్లు, వివిధ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు, వివిధ ఎన్జీవోల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, విద్యార్థినులు